

జహీరాబాద్ పట్టణంలోని షెట్కార్ ఫంక్షన్‌హాల్ లో నిర్వహించిన గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు

# గిరిజన అభ్యున్నతికి కృషి

**తండాలను గ్రామ పంచాయతీలు చేశాం**

**ఎస్టీ రిజర్వేషన్‌ను 10 శాతానికి పెంచిన సీఎం కేసీఆర్**

**విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పెంపు**

**గిరిజన రైతులకు పోడు పట్టాలు పంపిణీ**

**బీఆర్ఎస్ మ్యానిఫెస్టోనూ ఇంటింటికీ తీసుకుపోవాలి**

**జహీరాబాద్‌లో కుల, గిరిజన, ఎరుకల సంఘాల సమ్మేళనం**

**ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు**

జహీరాబాద్, నవంబర్ 16: గిరిజనుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి, ఆర్థికంగా, సామాజికంగా వారి అభ్యున్నతి కృషి చేస్తున్నారని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని షెట్కార్ ఫంక్షన్‌హాల్‌లో గిరిజనుల ఆత్మీయ సమేళం, లింగాయత్ సమాజ్ సామూహిక భవనంలో కుల సంఘాల సమావేశం, అతిథి హోటల్‌లో ఎరుకల సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గిరిజనులకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించేందుకు సీఎం కేసీఆర్ 10శాతం రిజర్వేషన్ పెంచారని గుర్తు చేశారు. పోడు భూములకు పట్టాలు పంపిణీ చేసి, హక్కులు కల్పించారన్నారు. పోడు భూములు ఉన్న రైతులకు పట్టాలు పంపిణీ చేయడంతో రైతుబంధు, బ్యాంకు నుంచి రుణాలు తీసుకునే అవకాశం వచ్చిందన్నారు. మారుమూల మొగుడంపల్లిలో గిరిజన బాలికల వసతి గృహం ఏర్పాటు చేశామన్నారు. కారు గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఝూటమాటలు చెప్పి మోసం చేస్తారని, ఆలోచన చేసి ఓట్లు వేయాలన్నారు. మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లిలో ఉన్న మోతేమాత దేవాలయం వద్ద జాతర నిర్వహణకు బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేసిందన్నారు. ఆలయం వద్ద కరెంట్ సౌకర్యం, తాగు నీరు సౌకర్యం కల్పించామన్నారు. గిరిజనులు సమావేశాలు నిర్వహించేకునేందుకు సామూహిక భవనం మంజూరు చేశామన్నారు. జహీరాబాద్ పట్టణం, మొగుడంపల్లి మండల కేంద్రంలో బంజారా భవనాలకు ప్రభుత్వం స్థలం ఇచ్చి, నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్‌లో 12 సార్లు ఎమ్మెల్యేగా ఉన్నా ఎందుకు బంజార భవనానికి స్థలం ఇవ్వలేదని ప్రశ్నించారు. గిరిజనులకు కిషన్ పవార్‌కు జిల్లా డైరెక్టర్ పోస్టు, శంకర్‌నాయక్‌కు టెలికం బోర్డు డైరెక్టరు పోస్టు ఇచ్చామన్నారు. గృహలక్ష్మిలో నియోజకవర్గానికి 3000 ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. ఎరుకల కులస్తుల అభివృద్ధికి బీఆర్ఎస్ కృషి చేస్తుందన్నారు. లంబడోళ్లకు అభివృద్ధి, సంక్షేమం అవసరం లేదని, సీసా, రూ.200 ఇస్తే ఓట్లు వేస్తారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అంటున్నారని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటల తీరు ఆలోచన చేయాలన్నారు. సీఎం కేసీఆర్ తండాలను పంచాయతీలుగా చేసి అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించారన్నారు.

జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనం, గిరిజన, ఎరుకల సమ్మేళనాలకు భారీగా ప్రజలు హాజరై బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపారు. సమావేశంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, టెలికం బోర్డు సభ్యుడు శంకర్ నాయక్, రైల్వే బోర్డు సభ్యుడు షేక్ ఫరీద్, జడ్పీటీసీలు, ఎంపీపీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గిరిజన ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ప్రజలు

### కుల సంఘాల భవనాలకు నిధులు మంజూరు

జహీరాబాద్ నియోజకవర్గంలో 12 సార్లు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారు. కుల సంఘాలకు ఎందుకు భవనాలు నిర్మించలేదని మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రతి కుల సంఘానికి స్థలం ఇచ్చి, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. మాల సంఘం భవనానికి నిధులు మంజూరు చేసి, స్థలం కేటాయించామన్నారు. బుద్ధ వనం కోసం 10 ఎకరాల భూమి కేటాయిస్తామని తెలిపారు. రెడ్డి సంఘం, యాదవ సంఘం, ముదిరాజ్ సంఘం, పద్మశాలీ సంఘం, గౌడ సంఘంతోపాటు పలు కుల సంఘాలకు స్థలం ఇచ్చి, నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. లింగాయత్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చి గౌరవించిందన్నారు. హుగ్గెల్లి చౌరస్తాలో బసవేశ్వర విగ్రహం ఏర్పాటుకు రూ.45 లక్షలు మంజూరు చేశామన్నారు. శాసన సభ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యే మాణిక్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రజా సంక్షేమానికి మ్యానిఫెస్టో ఏర్పాటు చేసిందని వివరించారు. సంగమేశ్వర ఎత్తిపోతలతో నియోజకవర్గంలో ఉన్న బీడు భూములు సస్యశ్యామలం కావడం ఖాయమని, కాళేశ్వరం నీటిని సింగూర్ ప్రాజెక్టులో నింపి, ఎత్తిపోతల ద్వారా జహీరాబాద్‌కు సరఫరా చేస్తామన్నారు.

### మంత్రి పర్యటన సక్సెస్

న్యాల్‌కల్, జహీరాబాద్ పట్టణ, కోహీర్ పట్టణంలో మంత్రి హరీశ్‌రావు పర్యటన సక్సెస్ కావడంతో నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం జోరు పెంచి అభ్యర్థి మాణిక్‌రావు గెలుపు కోసం ప్రయత్నాలు చేస్తుంది. ప్రతి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరిస్తున్నారు. దీంతో హద్నూర్‌లో నిర్వహించిన బహిరంగ సభకు భారీగా జనాలు హాజయ్యారు.

# కర్ణాటకను చూసి ఓటేయండి

కోహీర్, నవంబర్ 16: కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ అక్కడి ప్రజలకు ఐదు గంటలకు మించి కరెంటు ఇవ్వడం లేదని ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. గురువారం కోహీర్ పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ అక్కడి పరిస్థితులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు రెవంత్‌రెడ్డి మాట్లాడుతూ మూడు గంటల విద్యుత్ సరిపోతుందని రైతులందరూ టెన్ హెచ్‌పీ మోటర్లు పెట్టాలని అంటున్నాడని గుర్తు చేశారు. మోటర్లు కొనేందుకు రైతులకు అతడి తాత డబ్బులు ఇస్తాడా అని మండిపడ్డారు. 24గంటల కరెంటు కావాలంటే కారు, కేసీఆర్‌కు ఓటేయాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు జహీరాబాద్ ప్రజల సొంత ఇంటివాడన్నారు.



కోహీర్ రోడ్డు షోలో మాట్లాడుతున్న ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

### కోహీర్‌ను అభివృద్ధి చేస్తాం..

కోహీర్ పట్టణంలో రూ.11.50కోట్లతో 50 పడకల దవాఖానను నిర్మించామని వివరించారు. తాగునీటితో అనేక ఇబ్బందులు ఉండేవని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తున్నామన్నారు. మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలకు సొంత భవనాన్ని నిర్మిస్తామని హామీనిచ్చారు. డిగ్రీ కళాశాలను కూడా తప్పకుండా ఏర్పాటు చేయిస్తామన్నారు. అధునాతన హంగులతో నూతన బస్టాండును నిర్మిస్తామని వెల్లడించారు. అసైన్డ్ భూములను పట్టాభూములుగా మారుస్తామని స్పష్టం చేశారు. భూమిపై యజమానులకు పూర్తి అధికారం ఉంటుందన్నారు. వక్ఫ్ బోర్డు భూములను కాపాడుతామన్నారు. అనంతరం మ్యానిఫెస్టోను వివరించారు.

### ప్రచారం అదుర్స్..

కోహీర్ పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్ షో విజయవంతమయ్యింది. కోహీర్ పట్టణంతో పాటు పలు గ్రామాల నుంచి వేల సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు. దీంతో పట్టణమంతా గులాబీమయమైంది. ఎన్నికల ప్రచారం దిగ్విజయం కావడంతో బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు గెలుపుపై మరింత ధీమా పెరిగింది. కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, పరిశ్రమల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ తన్వీర్, బేవరేజెస్ మాజీ చైర్మన్ దేవి ప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మండలాధ్యక్షుడు నర్సింహులు, సర్పంచులు రాజశేఖర్, నర్సింహులు, రవికిరణ్, ఎంపీటీసీలు బక్కారెడ్డి, అనిత, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నేతలు సుభాశ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కలీం, ఆనంద్, వహీద్, నాగరాజు, ఉమర్‌అహ్మద్, మొగులయ్య, సందీప్, గణేశ్ రెడ్డి, రాజు, రత్నం తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గ్యారెంటీలను నమ్మొద్దు

న్యాల్‌కల్, నవంబర్ 16: కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను నమ్మొద్దని, తొమ్మిదన్నరేండ్లలో అన్నివర్గాల వారికి మంచి చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరువొద్దని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం మండల పరిధిలోని హద్నూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావుకు మద్దతుగా ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభకు ఆయన హాజరైయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రాన్ని యాభై ఏండ్లు పాలించిన కాంగ్రెస్ చేసిందేమీ లేదని, ప్రజలకు మళ్లీ ఒక్క అవకాశం ఇప్పుడు ఇవ్వాలనడం సిగ్గుచేటన్నారు. మండలానికి పక్కనే ఉన్న కర్ణాటక విధాన సభకు జరిగిన ఎన్నికల్లో గ్యారెంటీ పథకాలతో గెలిచిన కాంగ్రెస్ ఆ పథకాలను అమలు చేయలేక ఆపసోపాలు పడుతుందన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని వారెంటీ లేని గ్యారెంటీ పథకాలను తెలంగాణలో అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఇక్కడలో 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేస్తే, కర్ణాటకలో పొద్దున 2 గంటలు, రాత్రి 3 గంటలు కరెంటు ఇస్తున్నారు. ఇచ్చే ఐదు గంటల కరెంట్‌తో ఎకరం కూడా నీరు పెట్టుకోలేక అక్కడ రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. మోటర్లు కాలిపోవడమే కాకుండా సెల్‌ఫోన్ చార్జింగ్ కూడా పెట్టుకోలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మాయమాటలు చెప్పే కాంగ్రెస్‌కు ఓటు వేసి కటిక దరిద్రాన్ని తెచ్చుకున్నట్లే, అందుకు ప్రజలు ఆలోచించి ఓటువేయాలి..? స్విచ్ వేస్తే వచ్చే 24 గంటల కరెంట్ కావాలో.. 3 గంటల కరెంట్ ఇస్తున్న కాంగ్రెస్ కావాలో ప్రజలు ఆలోచించాలన్నారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలతో అన్ని రంగాలను అభివృద్ధి చేశారన్నారు. అసైన్డ్ భూములున్న రైతులకు పట్టా భూమిగా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. కొన్ని బ్యాంకులు ఇతర బ్యాంకుల్లో విలీనం కావడంతో రుణామాఫీ డబ్బులు రైతుల ఖాతాలో పడలేదన్నారు. వారందరికీ డబ్బులు చెల్లించే విధంగా కొత్తగా బ్యాంకు ఖాతా నెంబర్లు సేకరిస్తామన్నారు. రానున్న డిసెంబర్ 3 తర్వాత రైతుల ఖాతాలో వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికుడైన జహీరాబాద్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావును మరోసారి భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కలిసికట్టుగా కోరారు.



హద్నూర్‌లో సభలో ఎమ్మెల్యేగా మాణిక్‌రావును గెలిపించాలని కోరుతున్న మంత్రి తన్నీరు హరీశ్‌రావు



హద్నూర్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు